షాబాద్ అభివృద్ధి చెందడం ఖాయం

- పరిశ్రమల ఏర్పాటుతో మారిపోయిన ప్రాంత రూపురేఖలు
- రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి


వెంకమ్మగూడలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్, జూలై 2 : రానున్న రోజుల్లో షాబాద్ ప్రాంతం ఊహించని రీతిలో అభివృద్ధి చెందడం ఖాయమని రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని వెంకమ్మగూడ, ఉబ్బగుంట గ్రామాల్లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్థానిక జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి రూ.50లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు తరువాత గ్రామాల రూపురేఖలు మారిపోయినట్లు తెలిపారు. గ్రామాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు అందించడం జరిగిందన్నారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంతోపాటు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు దగ్గర్లో ఉన్న షాబాద్ మండలంతోపాటు చేవెళ్ల నియోజకవర్గం రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో హైతాబాద్, చందనవెల్లి, సీతారాంపూర్ ప్రాంతాల్లో పెద్దపెద్ద పరిశ్రమలు తీసుకువచ్చి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఇప్పటికే పరిశ్రమలకు భూములిచ్చిన చందనవెల్లి, హైతాబాద్, సోలీపేట్, సీతారాంపూర్ గ్రామాల రైతులకు ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి అత్యధికంగా నిధులు తీసుకువచ్చి గ్రామాలన్నీ ఆదర్శంగా తీర్చిదిద్దుతామని వారు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో చేవెళ్ల నియోజకవర్గానికి అత్యధికంగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అప్పటి మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డిల సహకారంతో షాబాద్ మండలంలో కంపెనీలు తీసుకువచ్చి పారిశ్రామికవాడగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఈసీ, మూసీ వాగులపై వంతెనల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతామని ఆయన చెప్పారు.

జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో గ్రామాల్లో పెద్దఎత్తున నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీటీసీ గుత్తి సునీత, మాజీ సర్పంచులు మద్దూరి శకుంతల, పగుడాల నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దూరి పాండు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఏండీ చాంద్‌పాషా, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు కొలన్ ప్రభాకర్‌రెడ్డి, కృష్ణగౌడ్, రమేశ్‌యాదవ్, దర్శన్, మల్లేశ్, గణేశ్‌గౌడ్, ఆయా పార్టీల నాయకులు రామస్వామి, చెన్నయ్య, వెంకటయ్య, నర్సింహులు, సుదర్శన్, దేవేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రాజుగౌడ్, గోపాల్, అవిలాశ్‌గౌడ్, నరేందర్, బొజ్జయ్య, పీఆర్ ఏఈ శ్రీదివ్య ఉన్నారు.

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

రంగారెడ్డి జిల్లా సహకార సంఘం అధికారి ధాత్రీదేవి

మొయినాబాద్ : సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి ధాత్రీదేవి


మొయినాబాద్ : సమావేశంలో పాల్గొన్న రైతులు

మొయినాబాద్, జూలై 2 : రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టిందని రంగారెడ్డి జిల్లా సహకార సంఘం అధికారి ధాత్రీదేవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకం కింద ఆర్థిక సాయం ఎన్ని ఎకరాల వరకు ఇవ్వాలో రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించడం కోసం మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ఆధ్వర్యంలో రైతులతో సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ చంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సమావేశంలో పాల్గొన్న రైతులు రైతు భరోసాపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొందరు 5 ఎకరాల వరకు మాత్రమే పంట పెట్టుబడి సాయం అందించాలని, కొందరు మాత్రం 10 ఎకరాల వరకు రైతు భరోసా సాయం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల అభిప్రాయాల మేరకు మాత్రమే ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేయనున్నదని చెప్పారు. వారం రోజుల క్రితం కూడా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి రైతులతో జూమ్ ద్వారా సమావేశమై రైతుల అభిప్రాయాలను తీసుకున్న విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. మరోమారు పీఏసీఎస్ ద్వారా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నామని చెప్పారు. రైతు భరోసా సాయం నిజమైన రైతులకు దోహదపడేలా ప్రభుత్వం పకడ్బందీగా ప్రణాళికలను రూపొందిస్తున్నదని పేర్కొన్నారు. వ్యవసాయం చేసే రైతుకు పంట పెట్టుబడి సాయమిచ్చి వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, ఏఈవోలు కుమార్, సునీల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్, డైరెక్టర్లు జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, రాఘవరెడ్డి, యాదయ్య, గంగమ్మ, భూపాల్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయం మేరకే రైతు భరోసా

అబ్దుల్లాపూర్‌మెట్ : రైతుల అభిప్రాయం మేరకే రైతు భరోసా అమలు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని జిల్లా డిప్యూటీ రిజిస్ట్రార్ నాగలింగాచారి అన్నారు. మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘంలో చైర్మన్ చేగూరి భరత్‌కుమార్‌యాదవ్ అధ్యక్షతన మంగళవారం రైతు భరోసాపై నిర్వహించిన ప్రత్యేక మహాజన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రైతులు వెల్లడించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అనంతరం రైతుల అభిప్రాయాలు, సలహా సూచనలను సేకరించారు. రైతులు సాగు చేసే భూములకే రైతు భరోసా ఇవ్వాలని కొంత మంది రైతులు పేర్కొనగా.. మరికొంత మంది రైతులు 5 ఎకరాల నుంచి 10 ఎకరాలలోపు వారికిస్తే సరిపోతుందని సూచించారు.

చైర్మన్ భరత్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వమిచ్చే రైతు భరోసాను సాగుచేసే కాలం నాటికి సకాలంలో రైతులకు అందించాలని కోరారు. గతంలో మాదిరిగా ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ ద్వారా ఇచ్చేలా కృషి చేయాలన్నారు. రైతులు ఇచ్చిన సలహాలు, సూచనలతోపాటు తమ సలహాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించేందుకే ఈ ప్రత్యేక సమావేశం నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ, ఏడీఏ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి కవిత, డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, యాదిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాములు, బాలనర్సింహ, లక్ష్మమ్మ, మాజీ చైర్మన్ యాదగిరిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ సతీష్‌గౌడ్, సొసైటీ బ్యాంక్ ఇన్‌చార్జి మేనేజర్ రాకేశ్‌గౌడ్ ఉన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భరత్‌కుమార్ యాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్

మాదక ద్రవ్యాలు వినియోగించవద్దు

ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, జూలై 2 : మాదక ద్రవ్యాల నేవి తాత్కాలిక సుఖాల కోసం ఉపయోగపడతాయని, వీటి అలవాటు వల్ల మనుషుల ఆరోగ్యం శారీరకంగా, మానసికంగా బలహీనపడి కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలు వినియోగించవద్దని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. మంగళవారం మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ సాధికారత శాఖ వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని వికారాబాద్‌లో ఎన్టీఆర్ చౌరస్తా నుంచి జగ్జీవన్‌రామ్ చౌరస్తా వరకు విద్యార్థులు, పోలీసులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వికారాబాద్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా దినం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలను వినియోగించి ఇబ్బందులపాలు కాకూడదన్నారు. వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వీటిని వినియోగించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయిని పట్టుకున్నామని, వారికి తగిన శిక్షలు పడ్డాయని పేర్కొన్నారు.

సంక్షేమ అధికారిణి వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు వాడటం వల్ల మనిషి బలహీనపడతాడని, వికారాబాద్ జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా చేయాలని పిలుపునిచ్చారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు వాడడంతో మనిషి కోలుకునే అవకాశాలు తక్కువని.. దానికి నివారణే ముఖ్యమన్నారు.

కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వెంకటేశ్, జిల్లా పంచాయతీ ఆఫీసర్ జయసుధ, పోలీస్ అధికారులు, డీసీపీయూ ఇన్‌చార్జి శ్రీకాంత్, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ వెంకటేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్, మహిళా సాధికారత కేంద్రం బృందం, చైల్డ్ లైన్ టీం, డీసీపీబో టీం విద్యార్థులు పాల్గొన్నారు.

తుర్కయాంజాల్ మున్సిపల్ కమిషనర్‌గా అమరేందర్‌రెడ్డి

తుర్కయాంజాల్, జూలై 2 : తుర్కయాంజాల్ మున్సిపల్ కమిషనర్‌గా కందుల అమరేందర్‌రెడ్డిని నియమిస్తూ మంగళవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కమిషనర్‌గా ఉన్న సత్యనారాయణరెడ్డి సస్పెన్స్‌కు గురికావడంతో మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ చంద్రశేఖర్‌ను ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు. చంద్రశేఖర్ ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో సమస్యలు పేరుకుపోయాయి. నూతన కమిషనర్ రాకతో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు భావిస్తున్నారు.

నిరుద్యోగంపై సీఎం ఉలుకూ పలుకేది?

పీడీఎస్‌యూ ఓయూ కమిటీ నాయకులు

- శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం ఆందోళన
- నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి: బీజేవైఎం అధ్యక్షుడు నితిన్
- ఎంజే మార్కెట్-చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

> సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్రం, నగర వ్యాప్తంగా నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన బాట పట్టారు. ఉద్యోగాల విషయంలో రేవంత్ రెడ్డి అధికారంలోకి రాక ముందు నిరుద్యోగులకు హామీల మీద హామీలు గుప్పించి, అధికారం వచ్చాక నిరుద్యోగులను, వారి సమస్యలను పక్కనబెట్టారు. అంటే.. 'ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా..' కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరున్నదని చెప్పకనే చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో మంగళవారం నగర వ్యాప్తంగా పలుచోట్ల వివిధ విద్యార్థి సంఘాలు ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేస్తూ ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేపట్టాయి. సీఎం స్పందించకుంటే.. ఇంటికి పంపించే కార్యక్రమాన్ని చేపడ్తామని నిరుద్యోగ యువత నిరసన గళం వినిపిస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 2: తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ అంశంలో అభ్యర్థులు తీవ్ర మానసిక ఆందోళనలో ఉన్నారని, వారికి భరోసా కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. గ్రూప్ -1, గ్రూప్ -2, గ్రూప్ -3 నోటిఫికేషన్లలో పోస్టుల సంఖ్యను పెంచాలని, మెగా డీఎస్సీని ప్రకటించాలని అన్నారు. నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు రావాలని పీడీఎస్‌యూ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు ఎస్.నాగేశ్వరరావు, ఓయూ అధ్యక్షుడు ఎన్.సుమంత్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే బాధ్యత పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. తాజాగా టెట్ రాసిన అభ్యర్థులకు డీఎస్సీ ప్రిపరేషన్‌కు తగిన సమయం లేకపోవడంతో వారికి నష్టం జరుగుతుందని, ఇందుకు గాను పోస్ట్ ఫోన్ చేయాలని పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో ఆందోళనా బాట పట్టినా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉపాధ్యాయుల బదిలీల ద్వారా ఏర్పడిన ఖాళీలను కలిపి, మెగా డీఎస్సీ నిర్వహించినపుడే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. వివిధ రకాల గ్రూప్ ఉద్యోగాలలో పోస్టులు తగిన మొత్తంలో లేవని, తక్షణమే పోస్టుల సంఖ్యను పెంచి, భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీజేవైఎం నాయకులు

సీఎంను ఇంటికి పంపించేందుకు సిద్ధం..

నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం..

శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేవైఎం ఆందోళన

శంషాబాద్ రూరల్, జూలై 2: నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని బీజేవైఎం శంషాబాద్ మండలాధ్యక్షుడు బుక్కా ప్రవీణ్ ఆరోపించారు. నిరుద్యోగులను ఆదుకుంటామని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వారిని ఆదుకోవడమే కాకుండా నిరుద్యోగులను అరెస్టు చేయడం, వారిపై దాడులు చేయడంపై మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో నిరుద్యోగులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఆరోపించారు. ఎన్నికలలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణలో ఎక్కడ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి ఉద్యోగులు ఇచ్చే బాధ్యత తనదేనని నమ్మించి, నిరుద్యోగుల ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన ఆయన వారిని పూర్తిగా విస్మరించారన్నారు. రేవంత్‌రెడ్డిని త్వరలో ఇంటికి పంపించడానికి నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం, తహసీల్దార్ నాగమణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన అధికారులు, విద్యార్థులు

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

పరిగి, జూలై 2 : పార్లమెంటులో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మంగళవారం పరిగిలో బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సనాతన ధర్మాన్ని కించపరిచేలా వ్యాఖ్యానించారని టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు హరికృష్ణ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. రాహుల్‌గాంధీ తాను చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింహులు, భీమయ్య, అశోక్, అనిల్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల హామీలకు పరిష్కారం ఎక్కడా?

- బీజేవైఎం అధ్యక్షుడు నితిన్ నందాకర్
- ఎంజే మార్కెట్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

సుల్తాన్ బజార్, జూలై 2 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే నేరవేర్చాలని భారతీయ జనతా యువ మోర్చా హైదరాబాద్, గోల్కొండ జిల్లా అధ్యక్షుడు నితిన్ నందాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నిరుద్యోగ భృతిని ఇవ్వాలని నాంపల్లిలోని మండల రెవెన్యూ కార్యాలయం వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లాలని నాంపల్లి ఎంఆర్‌వోకు ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా నిరుద్యోగుల పట్ల ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేకపోవడం, 'దున్నపోతు మీద వర్షం పడ్డ చందంగా..' ఉన్నదన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో 1:100 శాతం ప్రకారం, క్వాలిఫై చేయాలని, గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలని, ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను పోస్ట్‌పోన్ చేసి నూతన తేదీలను ప్రకటించాలని, అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్ కేటాయించాలని, పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీవో నం.46ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మోజంజాహి మార్కెట్ చౌరస్తాలో భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో గోల్కొండ జిల్లా అధ్యక్షుడు నితిన్ నందాకర్ రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మంగళవారం రాహుల్ గాంధీ డౌన్ డౌన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులను పోలీసులు అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు.

ఎంజే మార్కెట్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం హైదరాబాద్, గోల్కొండ జిల్లా అధ్యక్షుడు నితిన్ నందాకర్

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

వికారాబాద్ జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, జూలై 2 : ఇంటర్మీడియట్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రిన్సిపాల్స్ ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ అన్నారు. మంగళవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్రాభివృద్ధి ద్వారానే లక్ష్యాలను సాధించడం సాధ్యమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు అకాడమీ పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలన్నారు. అకాడమీ పుస్తకాలు చదివేవారే పోటీ పరీక్షల్లో రాణిస్తారని తెలిపారు. బ్యాక్‌లాగ్ సబ్జెక్టులున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య అందించాలన్నారు. వార్షిక పరీక్షల ఫలితాలను కళాశాలలవారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసినప్పుడే వారు భవిష్యత్తులో రాణిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో ప్రిన్సిపాళ్లు తమ కళాశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా ఇంటర్ విద్యాధికారికి వివరించారు. సమావేశంలో ప్రిన్సిపాళ్లు రాజ్‌మోహన్, చెన్నయ్య, నర్సింహారెడ్డి, కుమారస్వామి, శోభారాణి, సురేశ్వరస్వామి, మంజుల, నర్సింహులు, కార్యాలయ సిబ్బంది వినోద్, సలీమా బేగం, ఇందిరమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

ఇద్దరు వ్యాపార భాగస్వాముల మధ్య గొడవ

ఇద్దరికి గాయాలు

ఆదిబట్ల, జూలై 2 : ఇద్దరు వ్యాపార భాగస్వాముల మధ్య జరిగిన గొడవలో ఇద్దరు వ్యక్తులకు కత్తిపోట్లు కావడంతో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. శరణ్‌రెడ్డి, దీపక్‌రెడ్డి స్నేహితులు. కొంతకాలంగా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగుళూరు ఎక్స్ రోడ్డు వద్ద ఓ హోటల్ నడుపుతున్నారు. కొన్ని సమస్యల కారణంగా వ్యాపారంలో నష్టం వాటిల్లడంతో వారి మధ్య గొడవలు జరిగాయి. దీంతో దీపక్‌రెడ్డి వ్యాపారంలో పెట్టిన పెట్టుబడి నుంచి రూ.7లక్షలు తీసుకుని వైదొలిగాడు. కొంత కాలం తరువాత దీపక్‌రెడ్డి మరికొంత డబ్బు కావాలని శరణ్‌రెడ్డిని డిమాండ్ చేశాడు. ఆ సమయంలో దీపక్‌రెడ్డి మంగళవారం ఉదయం నుంచి హోటల్‌లోని ఓ రూంలో మరో వ్యక్తితో కలిసి మద్యం తాగుతున్నాడు. దీంతో ఇద్దరి మధ్య మాటలు పెరగడంతో దీపక్‌రెడ్డి తనతో తెచ్చుకున్న కత్తితో శరణ్‌రెడ్డిపై దాడిచేశాడు. ఈ క్రమంలో దీపక్‌రెడ్డికి తలపై గాయాలు కాగా.. పక్కనే ఉన్న మరో వ్యక్తి అడ్డుపడడంతో కడుపుకు గాయాలయ్యాయి. దీంతో వీరిద్దరిని స్థానిక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

టీ - హబ్‌లో 'డైలాగ్ ఇన్ ది డార్క్'

కొండాపూర్ : వైకల్యం కలిగిన వ్యక్తులను ప్రోత్సహించేందుకు, వారి పట్ల సానుభూతితో కాకుండా ప్రతిభను ప్రోత్సహించేందుకు ఫ్రీడమ్ కుకింగ్ అయిల్స్ సోషల్ కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా మంగళవారం నాలెడ్జ్ సిటీలోని టీ-హబ్‌లో 'డైలాగ్ ఇన్ ది డార్క్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వైకల్యంతో బాధపడుతున్నవారి ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.